క్లుప్తంగా

యలమంచిలి తహసీల్దార్‌గా సునీల్‌కుమార్


తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

యలమంచిలి: యలమంచిలి తహసీల్దార్‌గా మాతా సునీల్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన యలమంచిలిలోనే డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై ఉండి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. అయితే యలమంచిలి తహసీల్దార్‌గా డిప్యూటేషన్ ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు యలమంచిలి తహసీల్దార్‌గా పనిచేసిన లక్కు నరసింహారావు కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా బదలీ అయ్యారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్‌ను సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ మురళి, సీనియర్ వీఆర్వోలు గోటేటి లక్ష్మీ నరసింహారావు (బుజ్జి), గెడ్డం చిన సత్యనారాయణ, కాకితాపల్లి శ్రీనివాసరావు తదితరులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం


పాలకొల్లు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 25వ వార్డులో సచివాలయ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు పల్లంగా మారడంతో వర్షాకాలంలో నీరు నిలిచిపోయి ఆ వీధి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్, వార్డు ఇన్‌చార్జ్ కావలి శ్రీనివాసరావు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో సీసీ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిధులు అడగ్గానే మంజూరు చేసిన ఎమ్మెల్సీ శ్రీనివాస్‌కి వీధి ప్రజలు, వార్డు ఇన్‌చార్జ్ కావలి శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సరస్వతి దేవి విగ్రహప్రతిష్టాపన


ఏఎస్ఎన్ఎం కళాశాలలో సరస్వతిదేవి విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరస్వతి దేవి విగ్రహప్రతిష్టాపన చేశారు. గురువారం ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇంచార్జ్ కవురు శ్రీనివాస్ విగ్రహ నిర్మాణ వ్యయంతో నిర్మించిన సర్వసతి దేవి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో హోమం, ప్రతిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, చందక సత్తిబాబు, కళాశాల పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు సంగిసీడి రంగారావు, కారుమూరి రామలింగేశ్వరరావు, శ్రీనాథ్, నిమ్మకాయల రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఛాంబర్స్ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు హెటిరో ల్యాబరేటరీస్ సంస్థ నిర్వహిస్తుందన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులు 2021, 2022, 2023 సంవత్సరాల్లో ఏదైనా డిగ్రీ బీఎస్సీ (కెమిస్ట్రీ), పీజీ (కెమిస్ట్రీ), బీఫార్మసి చేసిన పురుష విద్యార్థులు అర్హులన్నారు. అదే విధంగా ఐటీఐ (ఫిట్టర్) చేసిన పురుష విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. అభ్యర్థుల విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు 2 పాస్‌పోర్ట్ ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాల కోసం ప్లేస్మెంట్ ట్రైనర్ కె. లక్ష్మణరావు 97013 94660కు ఫోన్ చేయాలని సూచించారు.

డ్రగ్స్ వాడకంతో తీవ్ర నష్టం

సాక్షి, భీమవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే తీవ్రంగా నష్టపోతారని భీమవరం సెబ్ సీఐ వీవీవీఎస్ఎన్ వర్మ అన్నారు. భీమవరం తిరుమల విద్యాసంస్థల్లో గురువారం ఏబీవీపీ, సెబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండడమేగాక దానివల్ల కలిగే అనర్థాలను ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సెబ్ ఎస్సై జి.సునీల్‌కుమార్, మడిపల్లి శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్


పాలకొల్లు: విద్యార్థులకు పారితోషికం అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్


నరసాపురం: విద్యార్థులకు ప్రశంసాపత్రం, నగదు అందిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ


పెనుమంత్ర: విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల్లో మరింత పట్టుదల, ఉత్సాహం, పోటీతత్వం పెరగాలని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల్ని స్కూల్లో చేర్పించండి వారి విద్యాభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని చెప్పినట్లే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. విద్యా ప్రమాణాలు పెంచడానికి ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి పారితోషికం అందజేయడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. తద్వారా ఒకరికన్నా మరొకరు మొదటి స్థానం సాధించాలనే పట్టుదల విద్యార్థుల్లో కలుగుతుందన్నారు. వచ్చే సంవత్సరం ఆణిముత్యాలు కార్యక్రమానికి ఎంపికయ్యేలా విద్యార్థులు పోటీతత్వంతో చదువుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనభరిచిన పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి, పోడూరు మండలాలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాలకొల్లు కోకోనట్ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు జె.వినీత ఎంపీసీలో 978, ఎస్ దీవెన కుమారి బైపీసీలో 972 జిల్లాలో ప్రథమ స్థానం సాధించగా, ఎస్.నందిని హెచ్ఈసీలో 867, యలమంచిలి ప్రభుత్వ కళాశాల విద్యార్థిని పి.కిరణ్మయి సీఈసీలో 894 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే బీవీఆర్ఎం మునిసిపల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని ఆర్.నేహ తరంగిణి 574, బి.దీక్షిత 571, సుభాష్ చంద్రబోస్ హైస్కూల్ విద్యార్థిని కె.మౌనిక దేవి 569 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి ప్రభుత్వం నుంచి ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ. 15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ. 10 వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ. 5 వేలు అందజేశారు. అలాగే ఈ ఏడుగురు విద్యార్థులకు ప్రభుత్వ పారితోషికంతో పాటు ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తన సొంతంగా రూ. 5 వేలు చొప్పున రూ. 35 వేలు విద్యార్థులకు అధనంగా పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఎంఈఓ ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చందక సత్తిబాబు, విద్యా కమిటీ చైర్మన్ కెల్లా పెద్దిరాజు, మానుకొండ శ్రీనుబాబు, ఖండవల్లి వాస్, కోరాడ శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, చెన్ను విజయ్, ఆర్ నాగేశ్వరరావు, బండి రమేష్, రేలంగి నరసింహారావు, పాలపర్తి కృపానాథ్, ఉప్పే పండు, రుంగాని దుర్గారావు, జమ్ము కాశి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలి

మొగల్తూరు: మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు రాబోయే రోజుల్లోనూ మంచి ఫలితాలు తెచ్చుకునేలా చదువుపై దృష్టి సారించాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ సూచించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా గురువారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటర్‌లో అత్యధిక మార్కులు తెచ్చుకున్న ఎస్.వినయ్ (957), ఎస్.పవన్(942)లకు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్ కొత్తపల్లి నాని, డాక్టర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పి.జాకబ్ రాజు, ఉపాధ్యాయులు పి.మార్క్, సాయిబాబు పాల్గొన్నారు.

పెనుమంత్రలో...

పెనుమంత్ర: రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్యను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కె.వేణుమాధవ్‌రెడ్డి పేర్కొన్నారు. పెనుమంత్రలోని ఆర్‌ఏజెడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ స్థాయిలో ఇంటర్, పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాల, పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించే నగదు, ప్రశంసా పత్రాలు, మెమెంటోలతో సత్కరించారు. ఆచంట ప్రభుత్వ కళాశాల ఇంటర్ విద్యార్థులు కుడిపూడి మానస (926, ఎంపీసీ) టి.శాంతి (904, బైపీసీ), జి.పావని (894, సీఈసీ), కె.రమ్య (585, హెచ్ఈసీ) గ్రూపుల్లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను అదేవిధంగా పదోతరగతిలో పెనుమంత్ర ఆర్ఏజెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థిని గోవిందరాజుల హరిత 565 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున నగదు, మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అదే విధంగా పోడూరు మండలం కవిటం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థిని వి.మోహనప్రియ 562 మార్కులతో ద్వితీయ స్థానం, గుమ్ములూరు జెడ్పీపాఠశాల విద్యార్థిని కె.బాలనందిని 561 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచి రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు, మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, పెనుమంత్ర జెడ్పీటీసీ సభ్యురాల కర్రి గౌరీసుభాషిణి, పోడూరు ఎంపీపీ సబ్బిత సుమాంజలి, పెనుమంత్ర, గుమ్ములూరు సర్పంచులు తాడిపర్తి ప్రియాంక, సోనియారాణి, పెనుమంత్ర, మార్టేరు, నెగ్గిపూడి, ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి మంగాదేవి, కర్రి అనురాధ, పెనుగొండ లక్ష్మి, ఉపసర్పంచ్‌లు భూపతిరాజు శ్రీనివాసరాజు, కర్రి వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

బోధన బాగుంది



ప్రైవేటు కళాశాలలో చేరాలనుకున్నాను. ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ కళాశాలలో చేరాను. ఇక్కడ అధ్యాపకులు తరగతులు చాలా బాగా చెబుతున్నారు. సబ్జెక్ట్ అర్థం కాలేదని అడిగితే మళ్లీ మళ్లీ వివరించి అర్థమయ్యేలా చెప్పుతున్నారు. అధ్యాపకుల ప్రోత్సాహంవల్లే తాను జిల్లా స్థాయిలో ర్యాంకు సాధించగలిగాను. జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం ద్వారా ప్రభుత్వం గుర్తింపు పొందడం చాలా ఆనందంగా ఉంది.

– ఎస్.వినీత

ఒత్తిడి లేని విద్య



ఇరుకు గదుల్లో కాకుండా విశాలమైన తరగతి గదుల్లో ఒత్తిడి లేని విద్యను నేర్చుకున్నాం. ఒత్తిడి లేకుండా అధ్యాపకులు ఎంతో గొప్పగా విద్యను అందిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రథమ స్థానం సాధించానంటే అది అధ్యాపకులు కృషి వల్లే సాధ్యమైంది. చదువుకోవాలనే కసి ఉండి స్నేహపూర్వకమైన అధ్యాపకులు ఉంటే ఎక్కడైనా ఉత్తీర్ణత సాధించవచ్చని దీనికోసం లక్షలాది రూపాయలు వెచ్చించాల్సిన అవసరం లేదు.

– పి.కిరణ్మయి

విద్యాకానుకతో భవిష్యత్‌కు బంగారు బాట


ఆచంటలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్న ఆచంట సర్పంచ్ కోట సరోజిని


ఆర్యపేటలో జగనన్న కానుక కిట్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మేడిది విజయ జ్ఞానమణి

పెనుగొండ: పోటీ ప్రపంచంలో రాష్ట్ర విద్యార్థులను తీర్చిదిద్దడానికి నాణ్యమైన విద్య నందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి భవిష్యత్‌కు బంగారు బాట వేస్తున్నారని పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. గురువారం పెనుగొండ మండలం ఇలపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పడపట్ల పద్మ నాగేశ్వరి, ఇలపర్రు సొసైటీ అధ్యక్షుడు వేండ్ర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ పిల్లి దుర్గారావు, ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, కటికతల మోహనరావు, గుణపాటి సంజీవరావు, యల్లమెల్లి భీమయ్యలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వ విద్య

ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలుస్తున్నారని ఆచంట సర్పంచ్ కోట సరోజిని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆచంటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ పుచ్చకాయల జ్యోతీ రామకృష్ణ, పెచ్చెట్టి సత్యనారాయణ, గొట్టుముక్కల ఏసోబు, ఆరుపల్లి శ్రీను, వేమన అప్పారావు, కామన హరిబాబు, హెచ్ ఎం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

యలమంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆర్యపేట సర్పంచ్ మేడిది విజయ జ్ఞానమణి చెప్పారు. ఆర్యపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఆమె జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు రకాల డిక్షనరీలు, బ్యాగులు, బెల్టులు, షూలు, సాక్సులు ఇవ్వడం ద్వారా విద్యార్థులు పాఠశాలకు రావడానికి ఆకర్షితులను చేస్తున్నారన్నారు. గతంలో తమ పిల్లలకు విద్యాబోధన చేయించడం తల్లిదండ్రులకు ఆర్థికంగా కష్టాలకు గురిచేసేదన్నారు. కుటుంబంలో పెద్ద కొడుకుగా జగనన్న ఆ బాధ్యత తీసుకుని తల్లిదండ్రులకు ఆ కష్టం లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దొంగ విజయ్‌కుమార్, మానుకొండ సోమరాజు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నల్లి ఆశ ప్రధానోపాధ్యాయుడు మండపాక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఫీజులతో మంచి విద్యనందించాలి


పిల్లలతో అక్షరాలు దిద్దిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నాగిని

నరసాపురం: ప్రైవేట్ విద్యాసంస్థలు తక్కువ ఫీజులతో మంచి విద్యనందించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని సూచించారు. పట్టణంలోని శ్రీగౌతిమి విద్యాసంస్థల యాజమాన్యం ఎల్‌కేజీ, యూకేజీ మొదటి, రెండవ తరగతి విద్యార్థులు కోసం కొత్తగా కిడ్స్ వరల్డ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. యూనిట్‌ను ప్రారంభించిన వైస్ చైర్‌పర్సన్ నాగిని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ప్రైవేట్ స్కూళ్లల్లో చదవుతున్న పేద విద్యార్థులకు కూడా అమ్మఒడి లాంటి పథకాలు అందిస్తుందని చెప్పారు. స్కూల్ సూపరింటెండెంట్ ఎండీ ఘఫార్‌ఖాన్ మాట్లాడుతూ కిడ్స్ వరల్డ్ యూనిట్‌లో టెక్నాలజీకి లనుగుణంగా డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. స్కూల్ కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్, డైరెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే


ఉల్లంపర్రులో చిన్నారులకు యోగ్యతా పత్రాలను అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రులో అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే, జన జన భాగీదారీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 5 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆరో ఏడాదిలో అడుగుపెడుతున్న చిన్నారులకు యోగ్యతా పత్రాలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆట, పాట, మాట నేర్పుతూ పిలల్లో సృజనాత్మకత పెంపొందించి అన్ని విషయాలు అర్థమయ్యేలా విద్యాబోధన నేర్పుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర తెలిపారు. కార్యక్రమంలో ఉల్లంపర్రు గ్రామ సచివాలయ కన్వీనర్ రావాడ సతీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, పాఠశాల హెచ్ఎం రాజు, అంగన్‌వాడీ టీచర్లు బి.నాగలక్ష్మి, ఎం.భాగ్యలక్ష్మి, బి.సురేఖ, ఎ.చంద్రకాంత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో పిల్లల పురోగతి

పెనుగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లల పురోగతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం అన్నారు. గురువారం కొడమంచిలి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు.

క్రీడలను ప్రోత్సహించాలి


ఇలపర్రులో విజేతకు ట్రోఫీని అందిస్తున్న సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షురాలు పద్మావతి

పెనుగొండ: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతకు అండగా నిలవాలని పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. ఇలపర్రులో ఆరవ వార్షికోత్సవ అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్‌విజేత ములపర్రు పెదగరవు జట్టుకు ట్రోఫీని, రూ.20 వేలు నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవ లేదన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా ఉత్తమ క్రీడాకారులను వెలికి తీయడానికి దోహదపడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేతా సత్తిబాబు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ పిల్లి దుర్గారావు, బొంతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

18న బాల సంస్కార్ టీచర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు

పోడూరు: గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసంస్కార్ సెంటర్ల టీచర్ల ఎంపికకు ఈ నెల 18వ తేదీ ఉదయం 10గంటలకు మార్టేరులోని శ్రీగౌరీ శంకర దేవాంగ కల్యాణ మండపంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డివిజన్ కోఆర్డినేటర్ వై.పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోడూరు, ఆచంట, పెనుగొండ, ఇరగవరం, పెనుమంత్ర మండలాల్లోని గ్రామాల్లో బాలసంస్కార్ సెంటర్లలో ప్రతీరోజూ సాయంత్రం బాలబాలికలకు చదువుతో పాటు శతక పద్యాలు, శ్లోకాలు, దేశభక్తి పాటలు, నైతిక విలువలు, మహనీయుల జీవిత చరిత్ర వంటివి బోధించడంతో పాటు యోగా నేర్పించేందుకు మహిళా టీచర్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కనీసం 10వ తరగతి పాసైన వారు అర్హులనీ, ఆసక్తి ఉన్న మహిళలు బయోడేటా, విద్యార్హతలు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 80748 32528, 94946 07680కు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ట్రీ కటింగ్‌లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు గురువారం నరసాపురం విద్యుత్ ఈఈ బళ్ల సురేష్ కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. పట్టణ సబ్‌స్టేషన్ 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్, విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. శంభునిపేట, బ్రాడీపేట, లక్ష్మీనగర్, మార్క్‌పేట, పెనుమదం రోడ్, సాయినగర్, బంగారు వారి చెరువుగట్టు, బ్రాడీపేట బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, భీమవరం: రాష్ట్రంలోని కడప స్పోర్ట్స్ స్కూల్లో 4, 5 తరగతుల్లో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎం.రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతిలో బాలికలు 20, బాలురు 20, ఐదో తరగతిలో బాలికలు 7, బాలురకు 4 సీట్లు ఉన్నాయన్నారు. దీనికి గాను శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు మండల స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులకు ఎంపిక పరీక్షలు నిర్వహించాలని, పరీక్షలో 8 పాయింట్ల కంటే ఎక్కువ సాధించిన క్రీడాకారులను ఈనెల 23న భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో నిర్వహించే జిల్లా స్థాయి ఎంపికలకు తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయి పరీక్షలో 13 పాయింట్ల కంటే ఎక్కువ సాధించిన క్రీడాకారులకు ఈనెల 29, 30 తేదీలలో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు అర్హత సాధిస్తారని రమేష్‌బాబు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు వారి ప్రతిభ ఆధారంగా ఇంటర్మీడియట్ వరకు ఉచిత వసతితో విద్యనందించి క్రీడల్లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. 4వ తరగతిలో చేరడానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్లో 3వ తరగతి పూర్తి చేయాలని, అలాగే 2014 ఆగస్టు 1వ తేదీ నుంచి 2015 జూలై 31వ తేదీ లోగా జన్మించి ఉండాలన్నారు. 5వ తరగతిలో చేరడానికి గుర్తింపు పొందిన స్కూల్లో 4వ తరగతి పూర్తి చేసి 2013 ఆగస్టు 1వ తేదీ నుంచి 2015 జూలై 31వ తేదీ లోపు జన్మించినవారై ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం 94403 75277 సెల్ నంబర్‌లో సంప్రదించాలని రమేష్‌బాబు కోరారు.

కోర్టు ఆదేశాలు ఉల్లంఘించారంటూ ఫిర్యాదు

ఆకివీడు: కోర్టు ఆదేశాల్ని ఉల్లంఘించి చేపల చెరువులో నీరు నింపుతున్నారని మండలంలోని కుప్పనపూడి గ్రామ మాజీ సర్పంచ్ మోటుపల్లి రాజు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు గురువారం విలేకర్లకు తెలిపారు. గత పదిహేను రోజులుగా అనుమతి లేకుండా చెరువు తవ్వుతున్న సంఘటనపై స్పందనలో ఫిర్యాదు చేశామని, ఆర్డీఓ వచ్చి పరిశీలించి, చెరువులో తదుపరి పనులు చేపట్టవద్దని ఆదేశాలిచ్చారన్నారు. అయినప్పటికీ చెరువు తవ్వకం పనులు జరుగుతుండడంతో కోర్టును ఆశ్రయించానన్నారు. చెరువు తవ్వకం పనుల్ని నిలుపుదల చేశామని తహసీల్దార్ కోర్టుకు తెలిపారని, అయినప్పటికీ పనులు పూర్తి చేసి బుధవారం నుంచి చెరువులో నీరు నింపుతున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఈ విషయాన్ని కోర్టుకు కూడా తెలియజేస్తానని చెప్పారు. చెరువులో నీరు నింపే పనిని నిలుపదల చేయాలని వీఆర్వోను ఆదేశించామని, నీరు తోడే మోటారును నిలుపుదల చేయించినట్లు తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు.

పేద రోగికి సాయం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని లక్ష్మీనగర్‌కి చెందిన ఆర్ రామారావు భార్య రొమ్ము సంబంధిత క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వృద్ధాప్యంలో ఏదైనా పని చేసుకుందామనుకుంటే రామారావుకి ప్రమాదం జరిగి కాలు విరిగింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రామారావు పరిస్థితిని వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ చెక్కును ఉపాధ్యాయుడు యు.పెద్దిరాజు ద్వారా రోగి రామారావుకి అందజేసినట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు తెలిపారు.

ప్రకటన

నా క్లయింట్ టాటా కేపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, పాలకొల్లు శాఖ వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్థిని కొప్పినీడి రామాంజనేయులు తండ్రి నరసింహారావు మార్టుగేజ్ చేయదానికి అంగీకరించారు. సదరు ఆస్థిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియచేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ 2641/2022, ఆర్.యస్.నం.10/16ఎ, మొగల్తూరు మండలం పేరుపాలెం చెందిన 242 చ.గ.స్థలానికి హద్దులు. తూర్పు: గట్టిం చింతారావుగారి ఇంటిస్థలం, పడమర: గట్టిం వెంకటరావుగారి ఇంటి స్థలం, ఉత్తరం: ఉమ్మడి దారి, దక్షిణం: కొప్పినీడి వంశీగారి ఇంటి స్థలం.
పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం., బి.ఎల్., అడ్వకేటు, పాలకొల్లు, సెల్ : 94904 38782

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

పాలకొల్లు సెంట్రల్: సమాజంలో వృద్ధులు శారీరక, మానసిక, ఆర్థిక, లైంగిక వేధింపులకు గురవుతున్నారని వాటిని అరికట్టాలని ఛాంబర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక ఛాంబర్స్ కళాశాలలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వంగా నరసింహారావు అధ్యక్షతన ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధులు వల్ల నేటి యువతరానికి పురాతన, పురాణ విషయాలు ఎన్నో తెలుసుకోవచ్చన్నారు. ముందుగా వృద్ధులపై జరుగుతున్న వేధింపులను గుర్తించి వారికి తగిన న్యాయం చేసి వేధించిన వారికి అవగాహన కల్పించాలంటూ తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి వెంకటరత్నం, పేరిచర్ల ప్రతాప్ రాజు, గుత్తుల సత్యనారాయణమూర్తి, కలిదిండి వెంకటపతివర్మ, గంటా నాగరాజు, నవతా భాస్కరరావు, రాయి సూరిబాబు పాల్గొన్నారు

మావుళ్లమ్మ జాతర ప్రారంభం

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభించారు. మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, మావుళ్లమ్మ ఆలయ పునర్నిర్మాణ కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని నిలబెట్టి గ్రామంలో గరగాలమ్మ తల్లి, సోమాలమ్మ తల్లి, పోతురాజు స్వామి ఆలయాలకు పానకాలు సమర్పించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 17న అమ్మవారి జాతర, 18 నుంచి తీర్థం, 22న అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.